# దాంపత్యానికి అనుబంధం

## విజయశ్రీ

''పెళ్ళయిన, అంటే భార్యా భర్తలు కాని,
ఆడమగల మధ్య స్నేహాలుంటాయా ? ''
--శేఖర్

''మరొక మనసు తన అపురూపమైన నిజాన్ని
నా మనసులో దాచుకోవటానికి ప్రయత్నిస్తోంది.
అది నా కెంతో గర్వాన్ని కలిగించింది. ''
--సుదర్శనరావు

''మీతో మాట్లాడుకోవడం ప్రారంభించిం
తర్వాత నాకు ఎంతో స్వేఛ్ఛ వచ్చినట్లయింది.
పంజరంలోంచి విడిచి పెట్టిన పక్షిలా
ఫీలవుతున్నాను. పైకి చెప్పుకోలేని ఊహలు,
ఆలోచనలు, భావాలు ఎన్నో ఎదుటివారు
ఏమనుకుంటారో అని అనుకోకుండా నిర్భయంగా
పైకి చెప్పగలుగు తున్నాను. కాని మనిద్దరి
స్నేహం మన దాంపత్యాలకి ఏవిధమైన అపకారం
కలిగించకూడదు. ''
-- సుహాసిని

సుదర్శనరావు తనభార్య సావిత్రికి ఆ ఉత్తరం రాసి అప్పుడే రెండురోజులయింది. పోష్టుచేద్దామా వద్దా అని ఇంతవరకూ తటపటాయించాడు. రాసింతర్వాత నాలుగయిదుసార్లయినా చదివి ఉంటాడు. బయలుదేరేముందే చికాగో ఎయిర్‌పోర్టులో మెయిల్‌బాక్స్‌చూసి అందులో వేద్దామని వెళ్లి బాక్స్‌లో సగందాకా పెట్టి మళ్లీ జేబులో పెట్టేసుకున్నాడు.

చికాగోలో ప్లేను లేటుగా బయలుదేరింది. ప్లేనులో కూర్చుని మరొకసారి చదివాడు ఉత్తరం. న్యూయార్కులో ప్లేను మారటానికి కొంత టైము పట్టింది. కెన్నడీ టెర్మినల్‌లో కూర్చుని మరొకసారి చదివాడు. ఆఖరిక్షణంలో లేచి పక్కనే ఉన్న పోష్టాఫీసులోకి వెళ్లి ఓవర్‌నైట్ డెలివరీలో పంపించేశాడు. పోష్టాఫీసులోంచి బయటికిరాగానే ఒక్కసారి అమ్మయ్య అనుకున్నాడు. ఇంక దాన్నిగురించి తర్జనభర్జనలు చేసుకుంటూ మనస్సు కలవరపరచుకోనక్కర్లేదు. కాని ఎందుకో అనుమానం వచ్చింది. ప్లేనెక్కి సీటులో స్థిరపడిన తర్వాత తన బ్రీఫ్‌కేస్‌లోంచి ఉత్తరం కాపీ తీసి చదవటం మొదలు పెట్టాడు. తను రాసిన ప్రతీదీ డూప్లికేటుచేసి పెట్టుకోవడం అతనికి అలవాటు.

మై డియర్ సావిత్రీ:

సుహాసినికి నాకు మధ్యగల స్నేహసంబంధం గురించి నీకు చెప్పవలసిన అవసరం వస్తుందని ఎన్నడూ అనుకోలేదు. నేను అమెరికా వచ్చిన మొదటిరోజుల్లోనే సుహాసిని హజ్బెండ్ శేఖర్‌తో నాకు పరిచయం అయింది. మేమిద్దరం ఒకేరూమ్‌లో ఉండేవాళ్లం కొన్నాళ్లు. నేను ఫిజిక్సులో గ్రాడ్యుయేట్ స్టూడెంట్‌గా వచ్చాను. అతను ఎంబియె చదవటానికి వచ్చాడు మొదటి సెమిష్టరు పూర్తికాకుండానే అతను ఇంకోయూనివర్సిటీకి ట్రాన్స్‌ఫరు చేసుకు వెళ్లిపోయాడు. అతను ఎమ్‌బియె మానేసి మెడికల్‌స్కూల్‌లో జాయినయ్యి ఎండోక్రినాలజీలో స్పెషలైజ్‌చేసి డాక్టరుగామారటం, సుహాసినిని పెళ్లిచేసుకు రావటం - ఈ విషయాలు మనం అందరం కలుసుకున్న దాకా నాకు తెలియనే తెలియవు.

మనవూరు వచ్చిన మర్నాడే అనుకుంటా శేఖర్ ఫోన్‌లో పిలిచాడు, మీరు పి. సుందర్శనరావుగారేనా అంటూ. ఆవీకెండే కలుసుకున్నాం. కలిసిన పది నిమిషాలకే ప్రపంచంలో ఉన్న సమస్యలన్నిటిని సుహాసిని సమీక్షచేసేసి '' అవి పరిష్కరించటానికి ప్రణాళికలు తయారు చెయ్యాలి మనం అందరంకలిసి'' అంది. నువ్వు సుహాసినిమీద జోక్ కూడా వేశావు, '' ఏ మండోయ్ సుహాసినిగారూ మీరు చాలా సమర్థురాలుగా కనిపిస్తున్నారు. అంత ఫాస్టుగా మావార్ని బుట్టలో వేసుకోగలిగిన మొట్టమొదటి వారు మీరే. ఆ వశీకరణ మంత్రమేదో నాకు కూడా ఉపదేశిస్తే ధన్యురాలనవుతాను'' అంటూ.

వాళ్లకి పాప పుట్టింతర్వాత మనిద్దరి కుటుంబాల పరిచయం పెరిగింది . వాళ్లస్తమానూ మనింట్లోనే ఉంటున్నట్లనిపించేది. నిజానికి స్వాతిని చిన్నప్పటినుంచి మనవే పెంచినట్లు చెప్పుకోవచ్చును. స్వాతికి మాటలురాగానే నన్ను ''దూదంకులూ'' అని పిలవటంమెదలుపెట్టింది. నీపేరు తన పేరు ఒకటే అనుకునేది. నిన్ను ''సాతీ'' అని పిలిచినప్పుడల్లా శేఖర్ మందలించి ''సావిత్రీ ఆంటీ'' అని పిలవమని హెచ్చరించే వాడు స్వాతిని. మనిద్దరికుటుంబాల మధ్య పెరుగుతున్న ఈ స్నేహ బాంధవ్యం చూసి మన మిగతా స్నేహితులు చాలా జెలసీ ఫీలయ్యే వారనుకుంటాను. శేఖర్, సుహాసిని వాళ్లింట్లో దొరక్కపోతే మనింట్లో వున్నారేమోనని పిలిచేవాళ్లు స్నేహితులంతా. ఒకోసారి విసుగొచ్చి, ''వాళ్లు ప్రతిక్షణం ఏంచేస్తూంటారో మాకెలాతెలుస్తుందండి?'' అని ఎదురు తిరిగి ప్రశ్నించే వాణ్ణి వాళ్లని. ఒకావిడ ఉండబట్టలేక తిరిగి సమాధానం చెప్పింది కూడాను, ''మీరూ వాళ్లూ ఎప్పుడూ ఒకచోటే ఉంటారుగదా అని పిలిచాను, ఏమీ అనుకోకండి'' అంటూ.

శేఖరూ, నేనూ మన కళాసమితిలో కలిసి పనిచెయ్యటం మనజీవితంలో అనేక మార్పులు తెచ్చింది. అతను నా పెయింటింగుల ఎక్జిబిషన్ ఏర్పాటు చేశాడు ఒకసారి. అతని కోరికని కాదనలేక నేను సుహాసిని పోర్ట్రెయిట్ వెయ్యడానికి ఒప్పుకున్నాను. సుహాసిని తన పోర్ట్రెయిట్‌ని నేను పెయింట్ చేస్తానని తెలిసిన వెంటనే నన్ను ఫోనులో పిలిచి ఎంతో సంబరంతో ఆవేశంతో మాట్లాడింది. ఎన్నాళ్లుపడుతుంది, పెన్సిలుతో గీస్తారా, రంగు పెన్సిళ్లు వాడతారా, లేకపోతే బ్రష్‌తో వేస్తారా రంగులు కలిపి -- అనేక రకాల ప్రశ్నలు కురిపించేసింది చిన్నపిల్లలా. అనకట్టలు దాటి పొరలి ప్రవహించే వరదల గోదావరిలా సాగిపోయే ఆ ఉత్సాహాన్ని ఆపి నిలబెట్టి, నా పెయింటిగు పద్ధతి తెలియజెప్పటానికి కొంత సేపు పట్టింది.

''నేను ఏదో సరదాగా నా సంతృప్తికోసం పెయింట్ చేసుకునే మామూలు మనిషిని. గర్వంగా నేనూ చిత్రకారుణ్ణే అని చెప్పుకోగలిగినంత ఆర్టిష్టుని కాను. నీ శేఖర్ ప్రోత్సాహంవల్లగాని నేనసలు ఎక్జిబిషన్‌లో పెట్టగలిగినట్టి చిత్రాలేమీ పెయింట్ చెయ్యలేదు. లెట్‌మి ఎక్స్‌ప్లెయిన్ టు యూ హౌ ఐ డు ఎ పెయింటింగ్. నేను పెయింట్ చెయ్యదలుచుకున్న వస్తువుని ముందు కలర్‌స్లయిడ్స్‌లో ఫొటోగ్రాఫ్‌చేస్తాను. ఆ స్లయిడ్స్ నేను తీరికగా కూర్చుని ముందు స్టడీ చేస్తాను. నాకు నచ్చిన యాంగిల్సులోవి కొన్నిసెలక్టు చేసుకున్నాక అవి ప్రాజెక్ట్ చేసి కేన్వాస్ మీద అవుట్‌లైన్ గీసి దాని పైన రంగులు వేయటం ప్రారంభిస్తాను. పోర్ట్రెయిట్లు కూడా అలాగే పెయింట్ చేస్తాను.'' అని వివరంగా నా పెయింటిగ్ పద్ధతి ఆమెకి ఎక్స్‌ప్లెయిన్ చేశాను.

''అయితే ముందు నాకు ఫొటోలు తీసు కుంటారన్నమాట. నేనింకా కదలకుండా గంటల తరబడి కూర్చోవాలేమో ననుకున్నాను'' అంది నీరసంగా. ఆ నీరసంలో నిరుత్సాహం గమనించక పోలేదు నేను.

''సారీ ఫర్ ది డిజప్పాయింట్‌మెంట్. యు కెన్ కమ్ అండ్ వాచ్ మి ఒన్స్ యినేవైల్ వెన్ ఐ యామ్ పెయింటింగ్'' అన్నాను.

నే నా పెయింటింగ్ చెయ్యటానికి షుమారు మూడువారాలు పట్టింది. సుహాసిని వచ్చి ప్రోగ్రెస్ గమనించి వెడుతూ ఉండేది మొదట్లో. తనూ శేఖరూ కలిసి వచ్చేవారు. అతను పైన లివింగ్‌రూమ్‌లో కూర్చునేవాడు నీతోనో, పిల్లలతోనో కబుర్లు చెబుతూ. పైగా '' ఆర్టిష్టుని డిష్టర్బ్ చెయ్యకూడదు పక్కని నుంచుని'' అని సుహాసినిని మందలించే వాడు. కాని సుహాసిని వచ్చి కూర్చుని నేను చేస్తున్న ప్రతీ చిన్నపని జాగ్రత్తగా గమనించేది. మొదట్లో ఏమీ మాట్లాడకుండా కూర్చునేది. తర్వాత తర్వాత నింపాదిగా నేనే మాట్లాడి ఎంకరేజ్ చెయ్యటంవల్ల కాన్వర్షేషన్ ప్రారంభించింది. పెయింటింగ్ గురించేకాదు అనేక రకాల విషయాల గురించి మాట్లాడుకోవటం మొదలు పెట్టాం.

ఆర్టు ఏక్జిబిషన్‌లో నావి మొత్తం యిర్వై పెయింటింగ్‌లయినా ఉండివుండాలి. వాటన్నిటిలోనూ అందరినీ అకర్షించినది సుహాసిని పోర్ట్రెయిట్. సుహాసినికి నాకు మధ్య సంభాషణలు ఆర్టు ఎక్జిబిషన్‌తో ఆగలేదు. వీలయినప్పుడల్లా తను పిలిచి మాట్లాడుతో ఉండేది.

సుహాసిని చాలా చురుకైనది, తెలివితేటలు కలది. చొరవ ఎక్కువ. మన కమ్యూనిటీ ఆర్గనైజేషన్‌లో ఆమె సాధించిన కార్యాలు నీకు నేను ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. నువ్వుకూడా చాలా ఉత్సాహంగా సుహాసినితో కలిసి పనిచేసిన ప్రాజెక్టులు చాలా ఉన్నాయి. ప్రతి ప్రాజెక్టులోనూ అందరిని కలుపుకుని తలపెట్టిన పని నిర్విఘ్నంగా ఎంతో సక్సెస్‌ఫుల్‌గా పూర్తవ్వటానికి కృషి చేసే మనిషి. తనకు తెలిసిన విద్యలన్నీ ఏదో రూపంలో మన సంస్కృతీ కార్యక్రమాల్లో ఉపయోగ పడేటట్లు చేసుకుంది. చిన్న పిల్లలందరిచేత లవణరాజు కల నృత్యనాటికగా వేయించింది ఒకసారి. ఆ ప్రొడక్షన్‌కి నేను కూడా నీ ప్రోత్సాహంవల్లనే చాలా హెల్ప్ చేశాను. స్టేజి మీద, నాటక కళలోనూ నాకేమి అనుభవంగాని, సరదా గాని లేవని ఎంతబతిమాలుకున్నా వినిపించుకోకుండా నువ్వు నన్ను ఆ ప్రాజెక్టులో యిరికించావు. ఎలిమెంటరీ స్కూల్ ఆడిటోరియంలో మామూలు స్టేజి మీద వేయించినా అందరికీ నచ్చింది ఆ ప్రదర్శనం. ముఖ్యంగా అందులో పాల్గొన్న పిల్లల తల్లిదండ్రులందరికి నచ్చింది. అమెరికాలో మన పిల్లలచేత డాన్సు నేర్పించి నాటకంవేయించింది సుహాసిని అని అందరూ మురిసి పోయారు. నేను తయారు చేసిన బేగ్రౌండ్ సెట్టింగులు చాలామంది మెచ్చుకున్నారు.

వాటిల్లో ఒక పెయింటింగ్‌ని శేఖర్ సుహాసిని వాళ్ల బేసిమెంట్‌లో గోడమీద పెరమెనెంట్‌గా పెట్టుకున్నారు కూడా!

ఆ రోజుల్లోనే మేమిద్దరం ఒకరికొకరు మనసు విప్పి మాట్లాడుకోవటం అలవాటయింది. ఆమె తన జీవితంలోఒకొక సంఘటన, కథలో ఒక అధ్యాయం తరవాత మరొకటి చదివి నట్లు, నాకు చెప్పటం మొదలు పెట్టింది. తన జీవితంలో ఆశయాలగురించి, తన తీరని కోరికల గురించి రకరకాలుగా నాకు విడమర్చి చెప్పుకునేది. కుతూహలంతో వినడమే కాకుండా నా మనసులో విషయాలుకూడా నేను చెప్పటం మొదలు పెట్టాను. నిజానికి సుహాసినితో మనసు విప్పిమాట్లాడుకోవటం నాకూ మొదట్లో వింతగా అనిపించినా, రానురాను నాకూ సంతృప్తి కలగటం ప్రారంభించింది. ఇది వరకెన్నడూలేని మనశ్శాంతి కలగటం మొదలుపెట్టింది.

ఒకనాడు మాసంభాషణ స్నేహం, బంధుత్వం, పరిచయం - ఇద్దరి మనుషుల మధ్య పెరిగే సంబంధాల గురించి ప్రారంభం అయింది. ఆరోజున ఒక కొత్తవిషయం తెలుసుకున్నాం. మా యిద్దరి సంభాషణంగురించి తను శేఖర్‌తో ఎప్పుడూ చెప్పలేదని, నేను నీతో ఎప్పుడూ చెప్పలేదనీ మా యిద్దరికీ ఆరోజునే అర్థం అయింది. ఈ సంభాషణలు మా ఇద్దరి రహస్యం అని గ్రహించిం తర్వాత వాటికి విలువ ఎక్కువయింది. అంతేకాదు మా యిద్దరిమధ్య ఒక అనిర్వచనీయమైన సన్నిహిత సంబంధం ధృఢ పడడం ప్రారంభం అయింది. మన దాంపత్యంలో ఇతరులకి తెలియనివీ, మనసొత్తు అనుకున్న విశేషాలుకూడా నేను సుహాసినికి చెప్పడం, తనూ అలాగే తన దాంపత్య రహస్యాలు నాకు చెప్పటం అలవాటయిపోయింది త్వరలో.

ఒకరోజున వాళ్ళిద్దరూ మనింటికి సమూసాలు చెయ్యటానికి నీకు హెల్పు చేస్తామంటూ వచ్చారు. సుహాసిని నీకు కిచెన్‌లో చాలా సహాయం చేసింది. నేనూ శేఖరూ కాస్సేపు పనిచేసి బేసిమెంటులోకి వెళ్ళి టేబుల్ టెన్నిస్ ఆడుకోవడం మొదలుపెట్టాం. పైన మీ పని మీరు చేసుకుంటూ మమ్మల్ని మరచిపోయారు. రాత్రి రెండో మూడో అయింది ఆవేళ వాళ్ళు వెళ్ళే సరికి. చాలా విషయాలు మాట్లడుకున్నాం .

స్నేహం గురించి డిష్కషన్‌లోకి దిగాం. తనచిన్ననాటి స్నేహాలగురించి చాలా సంగతులు చెప్పాడు. చివరకి తేల్చిందేమిటంటే తనకి ఇంతవరకూ చెప్పుకోదగిన ప్రాణస్నేహితులెవరూ లేరని, తనెప్పుడూ టచ్ అండ్ గో లాగ అంటీ ముట్టకుండా ఉండేవాడని, మనవూరు వచ్చి మనతో స్నేహం ప్రారంభం అయిందాక స్నేహం యొక్క విలువే అంతగా తనకి తెలియదని. తన భార్య సుహాసినితో కూడా, ఆమెను తను ఎంత గాఢంగా ప్రేమిస్తున్నా, ఈ మధ్యనే మనసు విప్పి మాట్లాడుకోవటం అలవాటవుతోందని, తను స్వతహాగా తనలో తాను దాచుకునే మనిషినని చెప్పాడు. అ మాటలు చెప్పటానికి కూడా చాలా ప్రయత్నం చేయవలసి వచ్చింది అతనికి.

అతను అడిగిన ఒక ప్రశ్న నన్ను గాఢనిద్రలోంచి హఠాత్తుగా లేపినట్లయింది. ''భార్యా భర్తలుకాని స్త్రీ పురుషుల మధ్య స్నేహాలుంటాయా?'' అన్నాడు. ఒక నిమిషం ఎందుకీ ప్రశ్న వేశాడా అని నాకు అనుమానం వచ్చింది. నేను ఫిలసాఫికల్‌గా ఏమీ తొణకకుండా సమాధానం యిచ్చాను. ''మన చుట్టూ ఉన్న సంఘాన్ని బట్టి ఉంటుంది. కన్సర్వేటివ్ సొసైటీలలో, అంటే మన భారతదేశం లాంటి చోట్ల (పాతికేళ్ళకిందటి భారతదేశం – మనకి తెలిసినది అదేగా), పరాయి ఆడపిల్లతో పరాయి మగవాడు మాట్లాడు కోవటంమే అనేక అభిప్రాయాలకి చోటిస్తుంది. పాశ్చాత్య సాంకేతిక

నాగరికతా ప్రభావం జీర్ణించుకున్న సంఘాలలో ఆడ మగ కలిసి మెలిసి పనిచెయ్యటం చాలా అలవాటు, అవసరం కూడాను. అంచేత అటువంటి స్నేహాలు ఉండడంకూడా మామూలు అయిపోతుంది. ఏ కారణం చేతనైతే నేమి ఇద్దరు మనుషులు కలిసి మెలిసి పనిచేసుకునే వాతావరణంలో తటస్తపడినపుడు, వారిద్దరి మధ్య సంబంధం ఏర్పడటం అసంభవం కాదు. అది మొదట ఒకరి మీద ఒకరికి గౌరవంగా ప్రారంభం అయి, స్నేహంగా మారటానికి అనేక అవకాశాలున్నాయి. ఈ సంఘంలో అటువంటి స్నేహాలే ప్రేమలకి వివాహాలకి దారి తీస్తాయి కూడా." అన్నాను.

"అది సరే, నా ప్రశ్న నిజంగా అంత జనరల్ సిట్యుయేషన్ గురించి కాదు. పెళ్ళయి అంటే భార్యా భర్తలు కాని ఆడమగల మధ్య స్నేహాలుంటాయా అని "

ఇంకా ఫిలసాఫికల్ గానే కంటిన్యు చేశాను నా జవాబు, " ఈ సొసైటిలో అదీ పోసిబులే. కాని అటువంటి స్నేహాలు సంఘం కట్టు బాట్లకి నియమితం కాకపోతే ప్రమాదాలకి దారి తీయవచ్చును. ఆడమగల మధ్య స్నేహం ప్రేమగా మారి వర్ధిల్లటానికి ఎంతో అక్కర్లేదు. అది కొంతవరకు సహజమైనదే. ఆ ప్రేమ వారివారి దాంపత్యాలకి ముప్పు తేకుండా ఉండాలంటే వాళ్ళు ఉన్నత స్వభావులయి ఉండాలి. పైగా ఆ స్నేహం మంచికి దారి చూపవచ్చును వారి జీవితాల్లో.

అతను నాకూ సుహాసినికి మధ్యగల స్నేహం గురించి తెలుసుకోవటానికి ప్రయత్నిస్తున్నాడేమో నని అనుమానం వచ్చింది. మర్నాడు ఈ విషయం సుహాసినితో డిస్కసుచేశాను.

"మనం మాట్లాడుకుంటూ ఉంటామని అతనికి తెలుసు, కాని ఏం మాట్లాడుకుంటున్నామో నేనతనికి చెప్పలేదు. అతను నన్నెప్పుడూ నిలబెట్టి అడగలేదు. మనం ఏదో లిటరేచర్ గురించి, ఆర్టు గురించి కబుర్లు చెప్పుకుంటామని అతని అభిప్రాయం" అంది సుహాసిని. నిజానికి మేం చాలవరకు అలాంటి కబుర్లే చెప్పుకునే వాళ్ళం.

"ఒకరి విషయాలు మరొకరికి చెప్పుకుంటున్నామేగాని ఏం చెడుపని చెయ్యటంలేదుగా. మీతో మాటాడిన ప్పుడల్లా నాకెంతో బరువు తీరినట్లు, శ్రమ తగ్గినట్లు అని పిస్తుంది. నా మనస్సెంతో ప్రశాంతమవుతుంది." అంది సుహాసిని.

ఆ మాటలు నాకూ ఎంతో గర్వం కలిగించాయి. నా వల్ల మరొక వ్యక్తికి సంతృప్తి ఆనందం కలుగుతోందంటే అది నాలో ఉన్న మంచితనమే అనుకుని ఆనందించాను. అటువంటి అదృష్టం ఎంతమందికి అబ్బుతుంది.

రెండేళ్ళక్రితం నువ్వు నాలుగువారాలు ఇండియా వెళ్ళావు. నవంబరులో అనుకుంటాను. సుహాసినీ, శేఖర్‌లు ఒకటి రెండుసార్లు నువ్వులేనప్పుడు వచ్చారు. లవణరాజకల డాన్సుడ్రామాకి మ్యూజిక్ రికార్డ్ చేసుకోవటానికి వీలవుతుందేమో మన సిస్టమ్‌మీద అని చెక్ చేసుకోవటానికి వచ్చారు. ఒకరాత్రి రెండుగంటలు కుస్తీపట్టాడు. సరిగ్గా రికార్డింగ్ అవలేదు. రెండుమూడు టేపుల్లోంచి తీసి ఎడిట్ చేసి కలపాలి.

ఒకరోజు మధ్యాహ్నం సుహాసిని పిలిచి అడిగింది. "అంకుల్, డాన్సుడ్రామా మ్యూజిక్ టేపు చేసుకోవాలి. నేనొచ్చి ట్రయిచేద్దామని ఉంది. మీకు ఖాళీ ఉంటుందా ఎప్పుడయినా?" అంది. ఆ రోజు నాకు ఖాళీయే. "నేనిప్పుడుఖాళీ గానే ఉన్నాను. యు కెన్ కమ్ అండ్ ఎక్స్‌పెరిమెంట్" అన్నాను. మ్యూజిక్ రికార్డింగ్ కాలేదు కాని రెండు గంటల సేపు ఒకరి కళ్ళలోకి ఒకర్ని చూసుకుంటూ మాట్లాడుకున్నాం. అంతవరకూ ఎప్పుడూ ఫోనులో మాట్లాడుకునే మాటలే ఆ రోజున ముఖాముఖీని చెప్పుకుంటూ ఉంటే మనస్సులు కలిసి పోయినట్లనిపించింది.

"శేఖర్ యింటికి వచ్చేవేళయింది. అతనికి ఇక్కడకి వస్తున్నానని నోటుకూడా పెట్టలేదు. వెడతాను అంకుల్" అంటూ లేచి బయలు దేరింది.

"ఐ యామ్ సారీ. రికార్డింగ్ చేసుకోకుండా కబుర్లతో టైమ్ వేస్టు చేశాను" అన్నాను నేనూ లేచి నిలబడితూ.

"నేనేగా యింతసేపూ మాట్లాడింది. ఇది నా తప్పే. నేనూ శేఖరూ కలిసి వస్తాం మళ్ళీ ఒకసారి" అంటూ ముందుకు గుమ్మం వైపు నడుస్తున్న సుహాసిని వెనుకనే ఉన్న నావైపు తిరిగింది. అనుకోకుండా మాచేతులు కలుసుకోవడమే కాకుండా ఒకరినొకరు గాఢంగా కౌగలించుకున్నాం. మరు క్షణంలో తప్పుచేసిన వాళ్ళలాగ వెంటనే సిగ్గుపడుతూ విడిపోయి దూరందూరంగా కారు దాగానడిచి వెళ్ళాం. నిశ్శబ్దంగా కారులో కూర్చుని కళ్ళతోటే బై అని చెప్పి వెళ్లిపోయింది.

తర్వాత నాలుగయిదు సార్లు వచ్చింది సుహాసిని. మ్యూజిక్ కావలసిందంతా తనే శేఖర్ సహాయం లేకుండానే రికార్డు చేసుకుంది. నేను చెయ్య గలిగిన సహాయం కొంచం చేశాను. మా ఇద్దరి మధ్య ఏదో అనిర్వచనీయమయిన సన్నిహిత సంబంధం పెరుగుతోందని నాకు అనిపించంది. పనిముగించుకు వెళ్లిపోతూ నాకు ఆమె గట్టిగా హగ్ యిచ్చి వెళ్ళటం అలవాటయిపోయింది. నాకు ఒక రకమైన సంతృప్తి, ఆనందం కలగటమే కాకుండా, నేను సుహాసిని రాకకై ఎదురుచూడటం అలవాటయిపోయింది. ఒకోసారి నేనే ఆ కౌగిలింతలని పొడిగించటానికి ప్రయత్నించే వాణ్ని.

క్రిందటి సంవత్సరం అంతా మనందరి జీవితాలలోనూ చాలా మార్పులు వచ్చాయి. నువ్వు, సుహాసిని కలిసి చేసే ప్రోజెక్టులు ఎక్కువయ్యాయి. ఆ సందర్భంలో సుహాసిని తరచుగా మనింటికి రావటం జరిగింది. చాలాసార్లు మేయిద్దరం కలిసి కబుర్లు చెప్పుకోవటానికి అవకాశం వచ్చేది నువ్వు ఆ సమయానికి యింట్లోలేకపోవడం వల్ల. ఒకోసారి నువ్వు ఏదో ఎమర్జెన్సీ కాల్ వచ్చి వెళ్ళిపోవటంవల్ల మే యిద్దరం మిగిలే వాళ్ళం కబుర్లు చెప్పుకుంటూ. అలా ఉన్న ఒకరోజున నాతో సుహాసిని తన దాంపత్యాన్ని గురించి చాలా వివరంగా మాట్లాడం ప్రారంభించింది.

"శేఖరూ, నేను అప్పుడే పన్నెండు సంవత్సరాలనుంచి భార్యభర్తలుగా కలిసి జీవిస్తున్నాము. కాని నా కింకా శేఖర్ పూర్తిగా అర్థం కాలేదు. అతన్నిగురించి నాకు తెలియని సంగతులెన్నో ఉన్నాయనిపిస్తుంది నాకు. ఈ మధ్యన స్వాతి స్కూలు గురించి మాయిద్దరిమధ్య జరుగుతున్న సంభాషణలు నాకే ఆశ్చర్యమేస్తున్నాయి." అంటూ మొదలు పెట్టింది.

"పెళ్లికాకపూర్వం నేను చాలా సార్లు అనుకునే దాన్ని,- నేను ఎవరితో జీవితం గడుపుతానో, ఎవరి మనస్తత్వానికి అనుగుణంగా నడుచుకోవలసి వస్తుందో, ఏ పంజరంలో పక్షిలాగ బతకవలసి వస్తుందో - అని. మా అమ్మ జీవితం చూస్తే నాకొక ఆందోళన కలిగేది. అమ్మ హాయిగానే ఉంటోంది. కష్టపడుతోందని కాదు.

సుఖంగా హాయిగా బతకటానికి ఎంతో త్యాగం చేసింది మా అమ్మ. తనకున్న కోరికలన్నీ కలలోని కథలేననుకుని , తన భర్త మాటే తనకు గీసిన గీత అనుకుని, స్వతంత్రం అందని స్వర్గం అనుకుని, ఉన్న వాటితోనే నిండుగా సంతృప్తి చెందుతూ హాయిగా బతుకుతోంది.

అమ్మ నాన్న స్వేచ్ఛగా బతకాలని నాకు ఎప్పుడూ తోచించలేదు. ఎంతసేపు మీ ఆయన్ని జాగ్రత్తగా చూసుకో మంచి ఇల్లాలవనిపించుకో అనే చెప్పేవారు. లేకపోతే అత్తవారింట్లో ఏం కష్టాలు పడతాననో వాళ్ళభయం. అమ్మ ఎక్కువగా చదువుకున్నది కాదు. అందం, మంచితనం ఆమెకున్న ఆస్తులు. ఎంతో స్వతంత్రంతో ఆకాశాన్ని అంటుకుని విహరించే పక్షిలా ఉండేనన్ను చూసి ఎంత ముచ్చట పడి పోయేవారో అమ్మ నాన్న.

కాని తల్లి తండ్రులు నన్ను ఎన్నాళ్ళు అలా పెంచగలరు? ఎవరినో ఒకరిని పెళ్లి చేసుకుని మరొకరియింటికి వెళ్ళిపోయేదాన్నే కదా! అప్పుడు నాజీవితం ఎలా ఉంటుందోనని నాకు ఆందోళన సహజంగా ఉండేది.

నా స్నేహితురాళ్లతో ఒకటి రెండుసార్లు ఆ ఆలోచనలగురించి అన్నాను, కాని వాళ్ళెవరూ నన్ను సీరియస్‌గా తీసుకునేవారు కాదు. 'నీకు నచ్చిన మొగుడు, నీ వేలుకింద వేలాడే మొగుడు వస్తాడు లేవో నీకు అనవసరంగా బాధపడకు' అనేది నా స్నేహితురాలు సుదేవి.

శేఖర్ అమెరికానుంచి వచ్చి నన్ను చూసుకుని పెళ్లి చేసుకుంటాననగానే మాఅమ్మకి నాన్నకి ఎంతో భారం తీరినట్లయింది. అంతేకాదు ఎంతో సంతృప్తి కూడా కలిగింది, తనకూతురికి తగినవాడు దొరికాడు అని. నా అంగీకారం చెప్పటానికి నాకు చాలరోజులు పట్టింది. శేఖర్‌తో రెండుమూడుసార్లు ప్రైవేటుగా మాట్లాడిందాకా నాకు ధైర్యం చాలలేదు, 'ఊ' అనటానికి. నేనింకా ఆలోచిస్తున్నానని తెలిసి తనే ఒకసారి వచ్చి ఒక గంటసేపు కూర్చుని మాట్లాడాడు. 'నా మనస్సులో ఏ అనుమానం ఉన్నా పైకిచెప్పి సందేహాలు తేర్చుకోవాలి మీరు ' అన్నాడు. నాలుగయిదు కాన్వర్శేషన్సుతో ఎన్ని సందేహాలు తీరుతాయి. చివరికి నేను సందేహాలు తీరటం వల్ల కాదు, అతనంటే యిష్టం పెరగటంవల్ల, 'ఊ' అన్నాను.

సరే నాన్నా మీ యిష్టం ''అనగానే మానాన్నగారి ముఖం పద్మంలా వికసించింది. మా అమ్మని నాన్నని సుఖపెడుతున్నాననే సంతోషం, శేఖర్ మంచివాడు అని నాలో ఏదో ఋజువుచేసుకోలేని నమ్మకం - ఈ రెండూ ఏ పాళ్లలో కలిసి నా మనసుని ఒప్పించాయో చెప్పటం కష్టం.

శేఖర్ నాజీవితంలో ఆశాజ్యోతిగా ప్రవేశించాడు. ఇంకా ఆశాజ్యోతిగానే మిగిలి ఉన్నాడు. నా స్వతంత్రానికి ఏవిధమైన అడ్డు కట్టలూ కట్టలేదు. అయినా ఏదో అనిర్వచనీయమైన దూరం మాయిద్దరిమధ్య ఉండిపోయింది. రెండు ప్రవాహాలు ఒకటయినట్లుగాలేదు. ఇంకారెండూ విడివిడిగానే సాగిపోతున్నాయి.

నిజం చెప్పాలంటే మనిద్దరి మనసులు కలిసినట్లు శేఖర్‌మనసూ, నామనసూ కలవ గలవా అని అప్పుడప్పుడు నాకు అనుమానం వస్తుంది. కలవ వచ్చునని ఆశ ఉంది పోలేదింకా ..........''

సుహాసిని చటుక్కున ఆగిపోయి నిశ్శబ్దంలో నిమగ్నం అయిపోయింది. దూరాన్ని నిశితంగా పరిశీలిస్తూ కిటికీ దగ్గర నిలబడిపోయింది, బయటికి చూస్తూ.

ఆ మాటలు విన్న నాకు ఏమనాలో తెలియలేదు. కాని నాకూ ఒకవిధమైన సంతృప్తి కలిగింది. మరొక మనసు తన అపురూపమైన నిజాన్ని నా మనసులో దాచుకోవటానికి ప్రయత్నిస్తోంది. అది నా కెంతో గర్వాన్ని కలిగించింది. నాకూ ఆ మనసు పై ప్రత్యేక ఆకర్షణ ఉందని, మనసునే కాదు ఆమెనుకూడా దగ్గరగా చేర్చుకోటానికి కుతూహలంగా ఉందని, ఇదివరకు నేను ఒప్పుకోలేక పోయినా ఆక్షణంలో నాకు విశదమయింది.

ఆనాటినుంచీ వీలయినపుడు కలుసుకుని మాట్లాడుకోవటమే కాకుండా, ఒకరినొకళ్లం దగ్గరిగా చేర్చుకుంటూ (ఇతరులెవ్వరూ లేనపుడూ, చూడనపుడూ) మెలగటం ఎక్కువయింది.

అలాంటి ఆంతరంగిక క్షణాలలో ఒక క్షణం ఒకరోజున నీ కంటబడింది. ఆ దృశ్యం నిన్ను చాలా కలవర పరిచింది. నువ్వు చూసినట్లు నాకు మాత్రమే తెలుసు, సుహాసినికి తెలియదు. ఆ రోజునించీ నువ్వు సుహాసినితో మామూలుగా మాట్లాడడం మానేశావు. సుహాసినితో నీ ప్రవర్తనలో మార్పు కలిగినా, నాతో నువ్వు ఏవిధమైన మార్పు చూపించలేదు. ఏమీ జరుగనట్లుగానే ప్రవర్తించావు.

నీతో స్నేహం సుహాసినికి చాలా ముఖ్యం. అ విషయం ఎన్నిసార్లు చెప్పిందో నాకు. ఆ స్నేహానికి ఏ మాత్రం లోటు కలిగినా చాలా బాధ పడుతుంది.

సుహాసిని ఒక రోజున లైబ్రరీలో కనిపించి ''మనం ఒకసారి కూర్చుని మాట్లాడుకోవాలి కొన్ని విషయాలు'' అంది. ''సరే'' నన్నాను. ఆరోజునే మధ్యాహ్నం యూనివర్సిటీ కేఫిటీరియాలో కలుసుకున్నాం. రెండుగంటలసేపయినా మాట్లాడుకున్నాం.

మామూలు పరిచయంగా ప్రారంభమై, సన్నిహిత సంబంధంగా మారి, ఆంతరంగిక మైత్రిగా రూపుచెందిన మా యిద్దరి మధ్యసంబంధాన్ని మొదటినుంచి చివరిదాకా సమగ్రంగా సమీక్ష చేసుకున్నాం. ఈ స్నేహంవల్ల మాయిద్దరిలో జరిగిన మార్పులు, వాటి పర్యవసానం అర్థంచేసుకోవటానికి ప్రయత్నించాం. ఈ స్నేహం మా యిద్దరిలో మంచి మార్పులకే దారి తీసిందని తెల్చుకున్నాం. ఆమెతోస్నేహం ప్రారంభం అయ్యాకనే కదా నాలో ఎన్నాళ్లనుంచో దాగి ఉన్న ''కవిత్వధోరణి'' బయట పడింది. నా ''భావగుచ్ఛాలు'' పబ్లిషుచేసినపుడు నువ్వునన్ను అడిగావు, ''ఇంతవరకూ మీకు కవిత్వంలో ప్రవేశం ఉందనే తెలియదు - ఇప్పుడీ ప్రతిభ బయటపడటానికి కారణం ఏమయినా ఉందా?'' అని. నేను నీకు సరియైన సమాధానం అప్పుడు ఇవ్వలేక పోయాను. ఇప్పుడు నీకు అర్థం అవుతుం దనుకుంటాను.

మా రెండుగంటల సంభాషణలోనూ చాలాసార్లు అంది సుహాసిని, ''మన స్నేహాన్ని సావిత్రి గారు అపార్థం చేసుకుంటారేమో'', అని.

''చెయ్యకూడని చెడు పని చెయ్యటం లేదు మనం. మన సాంగత్యం మన మంచికే తోడ్పడుతోంది'' అన్నాను

''నిజమే కాదన లేను. మీతో మాట్లాడుకోవడం ప్రారంభించింతర్వాత నాకు ఎంతో స్వేచ్ఛ వచ్చినట్లయింది. పంజరంలోంచి విడిచి పెట్టిన పక్షిలా ఫీలవుతున్నాను. పైకి చెప్పుకోలేని ఊహలు, ఆలోచనలు, భావాలు ఎన్నో ఎదుటివారు ఏమనుకుంటారో అని అనుకోకుండా నిర్భయంగా పైకి చెప్పగలుగుతున్నాను. కాని మనిద్దరి స్నేహం మనదాంపత్యాలకి ఏవిధమైన అపకారం కలిగించకూడదు. శేఖర్ గాని, సావిత్రి గాని దీన్ని అపార్థం చేసుకుంటే కలిగే పర్యవసానాలు ఊహించి చూడండి.'' అంది సుహాసిని తన సన్నని గొంతుకతో నేను ఏమనుకుంటున్నానో నిర్ధారణగా తెలియక.

''వాళ్లిదరికి మన ఇద్దరి దగ్గరి సంబంధం గురించి అసలు తెలియక పోతే అటువంటి అవకాశం రానే రాదుగా'' అన్నాను.

''తెలియదని ఎలా అనుకోగలం? వాళ్లుకూడా మనలాంటి మనస్సులు కలవాళ్లే. మనవంటి బుద్ధిశాలురే. గ్రహించలేరంటారా?

వాళ్లకేమాత్రం తెలియకుండా ఉండాలంటే మనం ఎంతో జాగ్రత్తగా ఉండాలి. ప్రతిక్షణం, ముఖ్యంగా వాళ్లయెదుట నున్నప్పుడు, అప్రమత్తతతో ఉండటం భరించరాని భారం అవుతుందేమో"

"నువ్వుచెప్పే మాటల్లో నిజం లేకపోలేదు. మనం ఒకవేళ జరిగినదంతా ఉన్నదున్నట్లు వాళ్లకి చెప్పింతర్వాత కూడా మనని అపార్థం చేసుకుంటే, కోరి అనవసరమైన ముప్పు తెచ్చి పెట్టుకున్న వాళ్లమవుతాం".

"అయితే మరి ఏంచేద్దాం? సావిత్రికి నాకు మధ్యగల స్నేహబంధంలో కలుగుతున్న మార్పులకి కారణమేమంటారు?"

"ఇదంతా ఎకడమిక్ డిస్కషన్. నువ్వు అనవసరంగా కలవరపడుతున్నావు. దేర్ మస్ట్ బి సమ్ అదర్ ఎక్స్‌ప్లనేషన్ ఫర్ సావిత్రీస్ బిహేవియర్" అని ఊరుకున్నాను.

"ఐ వాంట్ యూ టు సీరియస్‌లీ థింక్ యబవుట్ దిస్ మేటర్" అంది సుహాసిని.

నేను సుహాసిని మన లివింగు రూమ్‌లో చేతులు చేతులు కలుపుకుని ఒకరినొకరం దగ్గరకి చేర్చుకుంటూ మాట్లాడుకుంటూన్న క్షణం ఒకటి నీ కంటబడిందన్న విషయం నాకు తెలిసింది కాని సుహాసినికి తెలియదు. నేనా విషయం ఆమెకి చెప్పవలసిందేమో! కాని ఆమెకి తెలియకుండా ఉంటేనే మంచిదని అనుకున్నాను అప్పుడు.

అలా అనుకోవటంలో నా స్వార్థపరత్వం లేకపోలేదు. ఆమెతో నాకుగల సన్నిహిత సంబంధానికి ఏంలోపం కలుగుతుందోనని భయపడ్డాను. అమె నాకు దూరంగా వెళ్లిపోవచ్చు గదా!

తర్వాత చాలారోజులవరకూ మేం మళ్లీ ఈ విషయం గురించి మాట్లాడుకోలేదు. నీకూ సుహాసినుల మధ్య రిలేషన్‌షిప్‌లో ఏమీ మార్పులు జరగలేదు. సుహాసిని మనస్సు చాలా మథన పడుతోందని నాకు తెలుసు. దానికి కారణాలలో నేనొకటని కూడా నాకు తెలుసు.

అనేక రకాలుగా తర్కించుకుంటూ నన్ను నేనే అర్థంచేసుకోవటానికి ప్రయత్నం ప్రారంభించాను. "సుహాసినికి నాకు మధ్యగల బంధం ఎటువంటిది?" అనే ప్రశ్న నిరంతరం వేధించటం మొదలు పెట్టింది.

మా మనసులు కలియటమేకాదు, మా మమతలు కూడా గాఢంగా పెరుకుంటున్నాయి. ఆమె సౌమనస్యతేకాదు, సౌందర్యంకూడా నన్ను ముగ్ధుణ్ణి చేస్తున్న మాట వాస్తవం. ఆ సౌందర్యంతో కూడి తన్మయించాలని మనస్సు కోరుకున్న క్షణాలు అనేకం ఉన్నాయి. ఈ భావాలని నేను నాలో దాచుకోలేదు, నామనస్సులో ప్రవేశించిన ప్రతి భావన సుహాసినికి చెబుతూనే ఉన్నాను. నా భావనలకి సుహాసిని ఆశ్చర్య పడలేదు. సరిగదా అవి అర్థం చేసుకోవటానికి ప్రయత్నించింది. తనకున్న భావాలను కూడా నాకు తెలియ జేసుకుంది.

సుహాసిని సైకాలజిస్టుగదా. "మనస్సులు దగ్గర జేరిన కొద్దీ కోరికలు కూడా పెరుగుతాయి. ఇది సహజమైన ప్రవృత్తి. కాని మనస్సుకి మనం యిచ్చుకున్న స్వేచ్ఛ మన శరీరాలకి కూడా ఇచ్చుకుంటే ఎలా?" అంది మరొకసారి స్నేహ సంబంధాల ప్రస్తావన వచ్చినప్పుడు రెండు మూడు సార్లు మాట్లాడుకున్న తర్వాత ఒక అండర్‌స్టాండింగ్‌కి వచ్చాం.

మనస్సులలో ఎటువంటి అన్యోన్యానురాగ దీపికలు వెలుగుతున్నా, ఆవెలుగులో మామనస్సులు పవిత్రమైన పంథాలలోనే నడుచుకోవాలని నిర్ణయించుకున్నాం. రెండుమనస్సుల సమైక్యతలో కలిగిన శాశ్వత స్వేచ్ఛానుభూతిని, సృజనాత్మక రసోదయాన్ని క్షణికమైన రుచులతో కలగలుపు చెయ్యటం ఉత్తమంకాదని నిర్ణయించుకున్నాం.

ఈ నిర్ణయానికి దారి చూపించి ముందడుగు వేసినది సుహాసినే. ఆమె పరిపక్వ హృదయం నాకూ వెలుగుని చూపించింది. ఆమె సహృదయత వల్లనే నాకూ సంతృప్తికరమైన జ్ఞానోదయం అయింది. ఆమె అడ్డుపడకపోతే నేను సన్మార్గాన్ని అవలంబించ లేకపోతానని కాదు. కాని ఈ విషయంలో నాకామె గురువు.

మిగిలిన సమస్య ఒకటే. నీ కిదంతా అర్థం కావటం ఎలా? నీకు సుహాసినులకు మధ్య గల స్నేహం పునరుద్ధరించి నిలపెట్టడం ఎలా? బాధ్యత నాదే నని నాకు అర్థం అయింది.

"ఉన్నదున్నట్లుగా మన సంగతంతా మనస్ఫూర్తిగా సావిత్రికి చెబుతాను. సావిత్రి హృదయం మనలాంటి హృదయమే. మన సంబంధాన్ని తెలుసుకున్న తర్వాత మనపై ఆమెకు ఏవిధమైన అనుమానం ఉండదు. ఇది నా నమ్మకం" అని సుహాసినికి చెప్పాను.

కాని ఈ బాధ్యత నిర్వర్తించటమే కష్టం అయిపోయింది. మా యిద్దరి స్నేహాన్ని నువ్వు అపార్థం చేసుకునే "క్షణం" నువ్వు మరచిపో లేక పోయినా ఈ ఉత్తరం చదివాక సరిగా అర్థం చేసుకుంటావనుకుంటాను.

నువ్వునా సహధర్మచారిణివి. మరొకరి మనస్సుని దరిచేర్చుకున్న నామనస్సుని గురించి నువ్వు ఏమనుకుంటావో ఊహించటానికి ప్రయత్నించను. నీపై నాకున్న మమత గౌరవాలు ఎప్పుడూ తగ్గలేదు. సుహాసిని మనస్సు నన్ను ఆకర్షించునట్లు నీ మనస్సు ఎందుకు ఆకర్షించలేదో నాకు తెలియదు. కాని మన దాంపత్య సౌఖ్యానికి నాకు సుహాసినికి మధ్య పెరిగిన ఆకర్షణ ఏవిధంగాను అడ్డురాదని మట్టుకు గారంటీ ఇస్తాను.

నేనూ సుహాసిని ఎంత సన్నిహితులమయ్యామో, నువ్వూ సుహాసినీ కూడా అంత సన్నిహితులు కావాలని నా కోరిక. ఈ కోరిక తీరాలంటే నీ ఉదార స్వభావమే కావాలి.

సుహాసినితో తిరిగి నీ స్నేహం దృఢపడేదాకా నేను దూరంగా ఉండటం మంచిదని అనుకున్నాను. నా మనస్సుని కొంచం ప్రశాంత పరిచి జీవిత లక్ష్యాలు, స్నేహ సంబంధాలు వీటిగురించి స్పష్టంగా నా భావాలని, నా నైజాన్ని అర్థంచేసుకోవాలని అనుకున్నాను. కొన్నాళ్లపాటు దేశం వదలి వెళ్లి ఉంటే అటువంటి అవకాశం కలుగుతుందని నా ఆశ. ఏవో తీరనికోరికలతో మనస్సు బాధపడుతోంది. జీవితంలో నేను సాధించదలుచుకున్న పనులు ఇంకాఎన్నో ఎన్నాయి. ఎన్నాళ్లు ఈ దూరం అంటే నేనిప్పుడు ఏంచెప్పగలను? పారిస్ యూనివర్సిటీలో ఒక ఏడాది పాటు ఉండి రిసెర్చి చెయ్యటానికి అవకాశం వచ్చింది. లండన్‌లో ఉపన్యాసాలయిపోగానే ఇండియావెళ్లి రెండువారాలుండి పారిస్ వస్తాను.

నన్ను నేను అర్థంచేసుకోవటానికే కాదు, నువ్వు సుహాసినిని అర్థంచేసుకుని ఆమెను నువ్వు స్నేహితురాలుగా మళ్లీ స్వీకరించటానికి అవకాశం రావటానికి కూడా నేను దూరంగా వెళ్లటం మంచిదనే నా నమ్మకం. ఇక ఉంటాను.

-------సుదర్శనరావు (సంతకం)

పూర్తిగా చదివి ఆ ఉత్తరం జాగ్రత్తగా ఫోల్డు చేసి తిరిగి తన బ్రీఫ్‌కేసులో పెట్టుకున్నాడు. ఎయిర్ హోస్టెస్ లు డిన్నర్ సెర్వుచెయ్యటం ప్రారంభించారు. తన ఫేవరిట్ కాక్‌టేయిల్ వోడ్కామార్టీనీ ఆర్డర్ చేశాడు. * * * * * * * * *